


విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

ఎస్‌ఎఫ్‌ఐ సమావేశంలో వక్తలు పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చిత్తూరు సీతం కాలేజీలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా కార్యదర్శి వినోద్ కుమార్ ప్రస్తుత జిల్లా కన్వీనర్ మసూద్‌లు మాట్లాడుతూ శాస్త్రీయ విద్య కోసం నిరంతరం ఎస్‌ఎఫ్‌ఐ పోరాటం చేస్తున్నదని అన్నారు. విద్యార్థులు ప్రస్తుతం సోషల్ మీడియా, రకరకాల యాప్‌ల ప్రభావంతో విద్యపై దృష్టి పెట్టకుండా చెడు మార్గాలతో పయనిస్తున్నారని, వాటిని మానుకొని విద్యపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం సమాజం కోసం పనిచేస్తున్న విద్యార్థి సంఘమని, ఇలాంటి విద్యార్థి సంఘంలో చేరి సంఘాన్ని బలోపేతం చేసి సమాజం కోసం కూడా పనిచేసే విధంగా ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సిబాజ్, దిలీప్, మాజ్ పాల్గొన్నారు.

వర్షా(వ్యాధుల) కాలం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వర్షాకాలం సీజనల్ వ్యాధులు విజృభించే కాలం, వాతవరణం తడిగా ఉంటూ దోమల ఉత్పత్తిని పెంచి అంటువ్యాధులను వ్యాపింపజేందుకు అనువైనందిగా ఉంటుంది. అంటువ్యాధులపట్ల జాగ్రత్తగా ఉంటూ వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మన్నల్ని మనం కాపాడుకోవచ్చు...

ఇంటిపరిసర ప్రాంతాలో మరుగునీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇవే వ్యాధులకు కారణమవున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డెంగీ నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత, ఇతర వివరాలతో ప్లెక్సీలు ఏర్పాటు చేసింది. ర్యాలీలు నిర్వహస్తున్నారు. ఎప్పటికప్పుడు వైద్యఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేస్తోంది. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలంటూ సూచిస్తోంది. ఇందుకోసం ఏఎన్‌ఎంలు, ఆశాలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఇంత చేస్తూ ఏటా వర్షకాలంలో జిల్లాలో అక్కడక్కడా డెంగీ కేసులు వెలుగు చూస్తున్నాయి. డెంగీతో వైరల్ జర్వాల భారిన పడుతున్నారు. మలేరియా, ఫైలేరియా ఇతర విషజ్వరాల భారినపడకుండా ఉండాలంటే ముఖ్యంగా మన ఆవాసాల చుట్టుపక్కలా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ఉత్తమం.

డెంగీ అత్యంత ప్రమాదకరం..

సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న మనిష రక్తంలో లక్షన్నరకు పైగా ప్లేట్‌లెట్లు ఉండాలి. డెంగీ సోకిన వారిలో ఇవి గణనీయంగా తగ్గుతాయి. 30వేల కన్నా తక్కువ ఉంటే వెంటనే ప్లేట్‌లెట్లను ఎక్కించాల్సి ఉంటుంది. చిత్తూరు జిల్లాలో డెంగీ వ్యాధికి గురై ప్లేట్‌లెట్స్ తగ్గుతున్న వారు సమీపంలో వేలూరు సిఎంసి ఆసుపత్రిలో వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలోని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి, మదనపల్లి ఆసుపత్రుల్లో ప్లేట్‌లెట్లను ఎక్కించే సౌకర్యం ఉన్నా ఇక్కడి వైద్యసిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

- డాక్టర్ సుధారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులపట్ల ప్రజల్లో వివిధ రూపాల్లో అవగాహన కల్పించడం జరుగుతోంది. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చు. ప్రతి శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు. ఇల్లు, ఇంటి పరిసరాను శుభ్రంగా ఉంచుకోవాలి. డెంగీ దోమలు వృద్ధి చెందకుండా పూల కుండీలు, కూలర్‌లో నీరు నిల్వ ఉండరాదు. ప్లాస్టిక్ డ్రములు, ఇతర వాటిలో ఎక్కువ రోజులు నీటిని ఉంచరాదు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డెంగీ, మలేరియా, డయేరియా ఇతర వైరల్ జర్వాలకు దూరంగా ఉండవచ్చు.

యువత డ్రగ్స్‌కు బానిస కావద్దు

హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకూడదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం కూడలి నుండి ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని జిల్లా కలెక్టర్, చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్ మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ గాంధీ కూడలి నుండి ఎంఎస్‌ఆర్ సర్కిల్ మీదుగా నాగయ్య కళాక్షేత్రం చేరుకుని తిరిగి గాంధీ విగ్రహం కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో, ప్రతి ఊరిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రెండు వారాలపాటు నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ వేడుకల్లో జెండా పట్టుకుని తిరగడమే కాకుండా దేశభక్తిని చాటాలని, మన పరిసరాలను, నగరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యతని, యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. బుధవారం సుమారు 2వేలకు పైగా విద్యార్థులతో మువ్వన్నెల జెండాతో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 15వ తేదీన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుక సందర్భంగా జిల్లా కేంద్రంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిచే పతాకావిష్కరణ మహోత్సవం జరుగుతుందని, కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టాలని నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సమాజంలో డ్రగ్స్ వాడకం పెరిగిందని, సమాజానికి ప్రమాదకరంగా మారిందన్నారు. యువత మేలుకుని డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడకం వలన మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. సమాజాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ నియోజకవర్గాన్ని డ్రగ్ ఫ్రీ చిత్తూరుగా మార్చడానికి ప్రభుత్వంతో పాటు ప్రజలు సహకరించాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను అరికట్టడానికి జిల్లా కలెక్టర్, ఎస్‌పిలతో పాటు తాను కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, అడిషనల్ ఎస్‌పి రాజశేఖర్, డీఈఓ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థసేవకు పురస్కారం


పార్థసారధి నాయుడుకి ఉత్తమ సేవాపురస్కారం



ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైన పార్థసారధి నాయుడు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆగస్టు 15వ తేదీ స్వాత్రంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సామాజికసేవ విభాగంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పురస్కారం అవార్డు గ్రహీతగా చిత్తూరుకు చెందిన సేవాతత్పరులు పార్థసారథి నాయుడుని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈమేరకు రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుండి చిత్తూరు జిల్లా కలెక్టర్‌కి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. 15వ తేదీ అమరావతిలో జరిగే స్వాత్రంత్ర దినోత్సవం వేడుకల్లో 84 సంవత్సరాల పార్థసారథి నాయుడు సామాజిక సమాజ సేవలో విశేష కృషి చేసినందులకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అత్యున్నత పురస్కారం, ఉత్తమ అవార్డు అందుకొనున్నారు.

మరుదు సోదరుల విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహావిష్కరణ సభలో ఎంఎల్‌ఏ గురజాల, బుల్లెట్ సురేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్వాతంత్ర సమర యోధులు మరుదు సోదరుల విగ్రహల ఆవిష్కరణ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ అగుముడియార్ తుళువ వెల్లలార్ అసోసియేషన్ అధ్యక్షులు బుల్లెట్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విగ్రహాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం రాక మునుపే మరుదు సోదరులు బ్రిటిష్ వారితో పోరాటం చేశారని, ఆశ్రయం కల్పించిన వ్యక్తిని రక్షించడం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులు మరుదు సోదరులని తెలిపారు. సంఘం నాయకులు ఏసి షణ్ముగం, అరుణాచలం, ఆదినారాయణ, సెల్వం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో కార్యకర్తలకే ప్రాధాన్యత

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సీఎంటీ త్యాగరాజులు బుధవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తనపై నమ్మకంతో అందించిన బాధ్యతను నిర్వర్తిస్తానని, పార్టీ ఉన్నతకి, మొదలియార్ల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు నళినీ, సంఘం నేతలు పాల్గొన్నారు.

సురేంద్ర ఎంటప్రైజస్ ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక గంగనపల్లి రోడ్డులోని జిజేఎం కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సురేంద్ర ఎంటప్రైజస్‌ను బుధవారం ఎంఎల్‌ఏ గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సురక్షిత నీటిని తీసుకోవడం వల్ల అనేక వ్యాధుల నుండీ మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. ఇంట్లో అమర్చుకొనే వాటర్ ఫిటర్స్‌ను సరసమైన ధరలకు అందించడంతో పాటు విడిభాగాల విక్రయం, సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రొపరేటర్లు వినోద్‌కుమార్, మురళిమోహన్‌లను అభినందించారు.



సురేంద్ర ఎంటర్‌ప్రైజస్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఏ గురజాల

స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా వెంకట్రావు

ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా ఎడ్యుకేషన్ విభాగం ఆచార్యులు ప్రొ.పి.వెంకట్రావు ను నియమించడం జరిగినది. ఈ సందర్భంగా విశ్వవిద్యా లయం వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.యస్.ఆర్ కృష్ణమూర్తి వెంకట్రావుకు డీన్ ఆఫీస్ ఆర్డర్ విసి చాంబర్‌లో అందించారు. విశ్వవిద్యాల యంలోని ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు, విభిన్న విభాగాల అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా అటవీ శాఖ అధికారి భరణితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంలో భాగంగా ప్రధానంగా ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు రెవెన్యూ శాఖలతో పాటు అత్యవసర వైద్యసేవలను అందించేందుకు అవసరమైన పూర్తి సమాచారంను డిసిహెచ్‌ఎస్, డిఎం అండ్ హెచ్‌ఓ కలిసి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్స్ ఉన్న ప్రదేశాలకు దగ్గరలో అత్యవసర వైద్యసేవలు పొందడంలో భాగంగా సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న డాక్టర్ల వివరాలు, ఫోన్ నెంబర్లు, అంబులెన్స్ వివరాలు అవసరమైన పూర్తి సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని ఎన్‌హెచ్ 140 రహదారి పరిధిలో ఉన్న అన్ని ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి బ్లాక్ స్పాట్స్ తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జాతీయ రహదారి ప్రాధికారసంస్థ వారిని ఆదేశించారు. జాతీయ రహదారులలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల అధికారులు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్టిక్, సోలార్ లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేసేలా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నుండి తిరుపతికి వెళ్లే వాహనదారులకు ముందస్తుగానే సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారని, జాతీయ రహదారుల వెంట క్రాసింగ్ రోడ్స్‌కు ముందుగానే తిరుపతికి వెళ్లే మార్గాలను సూచించడం ద్వారా వాహనదారులకు సౌకర్య వంతంగా ఈ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సంఘాల లెక్కలు పారదర్శకంగా ఉండాలి: పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): స్వయం సహాయక సంఘాల ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా ఉండాలని చిత్తూరు డిఆర్డిఏ పీడీ శ్రీదేవి తెలిపారు. బుధవారం చిత్తూరులోని డిఆర్డిఏ సమావేశంలో జిల్లాస్థాయి డిఆర్డిఏ సిబ్బంది సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థిక కార్యక్రమాలు అన్ని ఇకపై సాంకేతపరంగా కొనసాగాలని ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లోని సంఘ సభ్యులను ఈ దిశగా చైతన్య పరచాలన్నారు. ఈ సాంకేతికను అందిపుచ్చుకుంటే సంఘ సభ్యులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని, అలాగే సంఘాల సంబంధించి ఆర్థిక కార్యక్రమాలన్నీ పారదర్శకంగా కొనసాగుతాయన్నారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా యాదమరి, తవణంపల్లి మండలాల్లో ఎంపిక చేసిన వీవోలో తొలివిడతగా ఈ నారి యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా సంబంధిత సంఘసభ్యులు సంబంధించి అన్ని ఆర్థిక వ్యవహారాలని యాప్‌లో పొందుపరచడం జరుగుతుందని తద్వారా సభ్యులకు తమ సంఘంలోని ఆర్థిక కార్యక్రమాల సంబంధించి సమగ్ర వివరాలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే మొబైల్ బుకింగ్ విధానం కొనసాగుతున్న నేపథ్యంలో సంఘ సభ్యులు సాంకేత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలన్నారు. అలాగే లోకోస్ మన డబ్బులు మన లెక్కలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. గ్రామ సంఘాల్లో లెక్కలన్నీ పారదర్శకంగా ఉండాలంటే క్షేత్రస్థాయి సిబ్బంది దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో సంఘాల్లోని అన్ని కార్యక్రమాలు టెక్నాలజీతో అనుసంధానం కానున్న నేపథ్యంలో సిబ్బంది కూడా వీటిపై సంపూర్ణ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. డిపిఎంలు సునీత , రవికుమార్, ఏపీఎంల మధు సుబ్బారెడ్డి, సీసీలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు విరాళాల వెల్లువ







ప్రజాశక్తి - తిరుమల: బెంగుళూరుకు చెందిన కె.యం.శ్రీనివాసమూర్తి అనే భక్తుడు బుధ వారం ఉదయం భోగ శ్రీనివాసమూర్తికి అలంకరించేందుకు రూ.25 లక్షలు విలు వైన వజ్రం, వైజయంతి పొదిగిన 148 గ్రాముల బంగారు లక్ష్మీ పతకాన్ని విరాళం గా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపం లో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంక య్య చౌదరికి ఆభరణాన్ని అందజేశారు.

టీటీడీకి రూ.కోటి విరాళం

అలాగే బెంగుళూరుకు చెందిన కల్యాణ్ రామన్ కృష్ణమూర్తి అనే భక్తుడు బుధవారం టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీ రూపంలో అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, భారతీయ జనతా పార్టీ నేత విష్ణు వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ శాసనసభ్యుడు సూర్యనారాయణ వున్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం దర్శన ఏర్పాట్లను చేయగా రంగనాయక మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు.

వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో కలెక్టర్




ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రముఖ పుణ్యక్షేత్ర, పర్యాటక కేంద్రమైన తలకోన సిబిఈటి ప్రాంగణంలో బుధవారం జిల్లాస్థాయి వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అటవీ శాఖలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌ఆర్‌ఓ, ఎఫ్‌బిఓల పరిధిలోని అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకొని సమస్యలను పరిష్కరించారు. యర్రావారిపాలెం మండలంలో ఏనుగు మృతికి గల కారణాలు, అటవీ సమీప ప్రాంతంలో పొలాలు వద్ద అడవి జంతువుల నుంచి పంట రక్షణకై రైతులు తీస్తున్న కరెంటు వాటి వలన జరిగే, ప్రమాదాలు గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సరీ ప్లాంటేషన్ పెంపకం కోసం స్థలం కేటాయించాలని ఫారెస్ట్ అధికారులు కలెక్టర్ కోరారు. అధికారులందరూ పనితీరును మరింత పెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. అనంతరం జలపాతం దగ్గరికి వెళ్లి ప్రమాద పరిస్థితులను, రోడ్డు మార్గాలను పరిశీలించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. డిస్టిక్ లెవెల్ ఫారెస్ట్ అండ్ వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ లో జిల్లాలో ఏనుగుల వలన నష్టపోయిన రైతులకు పెండింగ్లో ఉన్న నష్టపరిహారం వీలైనంత త్వరగా చెల్లించాలని, ఏర్పేడు మండలంలోని వెంకటగిరి మార్గంలో గల చింతలపాలెం చెక్ పోస్ట్ అక్కడే ఉంచేలా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర చర్యలు తీసుకో వాలని సమావేశంలో డిఎఫ్ఓ వివేక్ ఆనంద్ కోరా రు. శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్ర మ రవాణా చట్ట వ్యతిరేక కార్యక్రమాలను ఈ చెక్పోస్టు ద్వారా అడ్డుకోవడం జరుగుతుందని వివ రించారు. ఈ కార్యక్రమంలో జెసి, శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఎఫ్ఓ, పి.వివేక్ ఆనంద్, డిప్యూటీ సీఎఫ్, జి.శ్రీనివాసులు, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగభూషణం, జిల్లా అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

305 మందికి షో కాజు నోటీసులు

ఇంటింటా తిరంగా ర్యాలీకి హాజరు కాలేదని నోటీసులు జారీ చేసిన కమిషనర్

ఉదయం 6 గంటలకు 6.30 కల్లా రావాలని సమాచారమిస్తే ఎలా వెళ్లగలం..?

వేధింపులకు గురి చేస్తున్నారని సచివాలయ ఉద్యోగుల ఆవేదన



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో మంగళవారం ఉదయం 6:30 గంటలకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి సచివాలయ ఉద్యోగులు హాజరు కాలేదని సుమారు 314 మందికి కమిషనర్ మౌర్య షో కాజ్ నోటీస్ జారీ చేశారు. ఇందులో సచివాలయ విభాగానికి చెందిన వారు 281 మంది, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సూపరింటెండెంట్లు 24 మంది ఉన్నారు. మొత్తం 305 మందికి షోకాజ్ నోటీసు జారీ చేయడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం 6:30 గంటలకు తిరంగా ర్యాలీ పెట్టి సచివాలయ ఉద్యోగులకు ఉదయం 6 గంటలకు మెసేజ్ పెట్టడం వల్ల చాలామంది సచివాలయ ఉద్యోగులు ఈ ర్యాలీకి హాజరు కాలేదు. ర్యాలీ ముందు ఒక సారి, ర్యాలీ ముగిసిన తర్వాత మరోసారి అటెండెన్స్ తీసుకున్నారు. రాని వారిని గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఇందులో సచివాలయ అడ్మిన్ విభాగం, పారిశుద్ధ విభాగం, వెల్ఫేర్ విభాగం, ప్లానింగ్ విభాగం, ఆరోగ్య విభాగం, విఆర్ఓ విభాగం, మహిళా పోలీసు విభాగాలకు చెందిన వారు ఉన్నారు. ఉదయం 6 గంటలకు మెసేజ్ పెట్టి 6.30 కల్లా ఇంటింటా తిరంగా ర్యాలీకి రమ్మంటే ఎలా వస్తారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ర్యాలీ రెండు రోజుల ముందే నిర్వహిస్తున్నారని ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ సచివాలయ ఉద్యోగులకు మాత్రం ఉదయం 6 గంటలు సమాచారం ఇవ్వడం వల్ల చాలామంది రాలేకపోయారని, రాని వారికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులు పి4 సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, ఇతర సర్వేలు నిర్వహిస్తున్నప్పటికీ వారి పట్ల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎంత కష్టపడి పని చేస్తున్నప్పటికీ సెలవులు లేకపోయినా కూడా సమీక్ష సమావేశాలు, టెలికాన్ఫరెన్స్‌లు ఎప్పుడంటే అప్పుడు నిర్వహించి తమను ఇబ్బంది కలిగిస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నా అధికారులు మాత్రం తమ పట్ల చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ వాటి సంబంధించిన డబ్బులు కూడా సచివాల సిబ్బందికి ఇవ్వకపోవడం దారుణం. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలని కోరుతున్నారు.



యువజన దినోత్సవంలో పాల్గొన్న వెదురుకుప్పం విద్యార్థులు

యువజన దినోత్సవంలో వెదురుకుప్పం విద్యార్థులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో వివిధ విభాగాల్లో బుధవారం నిర్వహించిన యువజన దినోత్సవ పోటీల్లో డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 18 మంది పాల్గొన్నారు. అందులో ఫొటోగ్రఫీ విభాగంలో రెండవ సంవత్సరం బికాం చదువుతున్న బి చంద్రశేఖర్ రెడ్డి తృతీయ బహుమతి గెలుపొందారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ బి అన్నపూర్ణ శారద విద్యార్థిని అభినందించారు. సాంస్కృతిక, ఆటల పోటీలలో జరిగే పాల్గొని గెలుపొంది కళాశాలకు వన్నె తీసుకురావాలని విద్యార్థులకు ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగపు కోఆర్డినేటర్ బి మోహన్ రావు, ఎన్ఎస్ఎస్ విభాగపు అధికారి డాక్టర్ సి మంగళ గౌరీ, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో అలరిస్తున్న విద్యార్థుల గొల్లభామ వేషధారణ

అలరించిన విద్యార్థుల వేషధారణ

ప్రజాశక్తి -కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటి నగరంలోని శ్రీలక్ష్మీ నరసింహా ప్రైవేటు పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భం గా విద్యార్థులు వేసిన గొల్లభామ వేష ధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆ పాఠశాల డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ అని, ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన కోలాటం, ఉట్టికొట్టడం వంటి వేడుకలు చూపరులను ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పురుషోత్తం, దిలీప్ కుమార్, ధనంజయరెడ్డి, ఉపాధ్యాయులు హేమలత, సౌమ్య, హంస, వెంకటాద్రి, మమత, కాంచన, తేజోమయి, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్‌పి సీఈవో రవికుమార్‌నాయుడు

సర్వేలు పారదర్శకంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రభుత్వం చేపడుతున్న అన్ని సర్వేలను పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రవికుమార్ నాయుడు సూచించారు. మండలంలోని లక్కనపల్లి సచివాలయంను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ 'ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి సర్వేను సకాలంలో, తప్పులేదు అనే విధంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తరువాత ఆయన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, తరగతి గదుల్లో విద్యార్థుల నుండి మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠ్యాంశాల బోధన స్థాయిపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల సౌకర్యాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసి, సౌకర్యాలపై సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ పరిపాలనాధికారి కె ఆనందబాబు, డిప్యూటీ ఎంపిడివో నాగార్జున్ రెడ్డి, వైద్యాధికారిణి డాక్టర్ శాలిని, పాఠశాల హెచ్‌ఎం కవిత పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మునినారాయణ జూనియర్, డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమరనాథ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరు గ్రావెల్ టిప్పర్లు సీజ్

ప్రజాశక్తి -విజయపురం: మండలంలోని మహారాజపురంలో వేరు



వేరే బిల్లులతో వెళుతున్న ఆరు టిప్పర్ లారీలను సీజ్ చేశామని తహశీల్దార్ కిరణ్ బుధవారం తెలిపారు. జాతీయ రహదారి పనులకు గ్రావెల్ మట్టి తరలించకుండా తమిళనాడు వేరు వేరు బిల్లులతో గ్రావెల్ తరలిస్తున్నారని అభియోగం రావడంతో బిల్లులను పరిశీలించి సీజ్ చేశారు. బుధవారం మైనింగ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు టిప్పర్ మట్టిని అంచనా వేశారు. టిప్పర్ సాధారణంగా 25 మెట్రిక్ టన్నులు తీసుకెళ్ళా -లని, కానీ 37.5 మెట్రిక్ టన్నులను ఓవర్ లోడ్‌తో తరలించారని తెలిపారు. మండలంలో శాశ్వత ప్రాతిపాదికన 8 గ్రావెల్ క్వారీలు ఉన్నాయని, వాటిలో పనులు జరుగుతున్నాయా? లేదా అంటే తనిఖీ నిమిత్తం టెక్నికల్ అధికారి చారీ పరిశీలించారని తెలిపారు. మండలంలో శాశ్వత క్వారీలు ఏవీ జరగడం లేదని స్పష్టం చేశారు. టిప్పర్లకు జిల్లా మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్ బాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తిష్ట!

- జగనన్న కాలనీలో మౌలిక వసతులు కొరత
- రోడ్లు, మురుగునీటి కాలువలు కరువు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -పుంగనూరు: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీలో మౌలిక వసతులు కరువయ్యాయి. రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయలేదు.. ప్రభుత్వ పాలకులు, అధికారులు పట్టించు కోకపోవడంతో జగనన్న కాలనీలో నివసిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు.

సమస్యలు తిష్ట!

అర్హులైన పేదలందరికీ ప్రత్యేక గ్రామాలు ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం జగనన్న కాలనీలుగా నామకరణం చేసి ఇళ్ల పట్టాలు అందించారు. పుంగనూరు మున్సిపాల్టీ పరిధిలో సుమారు 1100 మంది లబ్ధిదారులకు ఐదు ప్రాంతాల్లో జగనన్న కాలనీలుగా నామకరణం చేసి పట్టాలు అందించారు. పుంగనూరు పట్టణానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో కాలనీలు ఏర్పాటు చేశారు. పట్టాలు అందించారు. కానీ గృహ నిర్మాణ పథకం ద్వారా కొందరు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తు న్నారు. మరి కొంతమంది పునాదులు మాత్రమే తీసి అలాగే వదిలేసిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇచ్చే డబ్బు చాలక అప్పు చేసుకోలేక అర్ధాంతరంగా కొన్ని ఇళ్లు మొండి గోడలకే పరిమిత మయ్యాయి.

మౌలిక వసతులు కొరత

పుంగనూరు పట్టణానికి గూడూరుపల్లి 1, 2, శుభారం డిగ్రీ కళాశాల, రాంపల్లి, రాగానిపల్లి, ప్రాంతాలుగా విభజించి మొత్తం 1100 మందికి అప్పటి ప్రభుత్వం పట్టాలు అందించింది. అయితే అక్కడ మౌలిక వసతులు మాత్రం చేపట్టలేక పోయారు. తాగునీరు మాత్రం అందించి మిగిలిన వసతులన్నీ గాలికి వదిలేశారు. ఈ కారణంగా స్థానిక ప్రజలు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు.

రోడ్లు, మురుగునీటి కాలువలు కరువు

కాలనీలలో ప్రధానంగా రోడ్లు, మురుగు నీటి కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలలో రోడ్డుపై ఎత్తయిన మట్టి దిబ్బలు నడవడానికి కష్టంగా మారాయి. రాత్రి వేళల్లో వెళ్లాలంటే మరీ కష్టంగా ఉంటుందంటూ వారు వాపోతున్నారు. రోడ్డు సౌకర్యం లేకుండానే ఇక్కడి నుంచి రాత్రి వేళల్లో అవసరాల కోసం



మౌలిక వసతులు కరువైన జగనన్న కాలనీ

పట్టణానికి వెళ్లాలంటే పిల్లలు, పెద్దలు భయాందోళనకు గురవుతున్నారు. సరైన రోడ్డు లేక కాలనీ వాసులు ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు

జగనన్న కాలనీలో సమస్యలు తిష్టవేసినా అటు ప్రభుత్వ పాలకులు, ఇటు ప్రభుత్వ అధికారులు పట్టించు కోవడం లేదు. ఇకనైనా స్పందించి జగనన్న కాలనీలో సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని జగనన్న కాలనీ వాసులు కోరుతున్నారు.



పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

అభ్యసన సామర్థ్యం పెంచండి: ఎంఈవో

ప్రజాశక్తి-సోమల: ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో విజయ కుమారి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సోమల లోని చెన్నయ్య గారి పల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి విద్యార్థులలో పఠన సామర్థ్యం ఎలా ఉందో పరిశీలించి వారి నుండి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మరింత రుచికరంగా వండి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు సుజాత, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి- పూతలపట్టు: రైతులు సేంద్రియ ఎరువుల వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం రైతులతో మమేకం కార్యక్రమంలో భాగంగా కొత్తకోట పంచాయతీ చెర్లోపల్లి గ్రామంలోని పలువురు రైతులతో ఆయన మమేకమయ్యారు. వ్యవసాయ పద్ధతులపై ఆరా తీశారు. పలు రకాల పంటలను ఆయన పరిశీలించారు. వ్యవసాయ రంగంలోని పలు మెలుకులపై రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారిని మధురవాణి, రైతులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా జీఎం రాజు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలం శెట్టిపల్లి గ్రామా నికి చెందిన



ముఖ్యమంత్రితో జీఎం రాజు

జిఎం రాజు నియోజక వర్గంలోని మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమి తుల య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకంగా ఈ పదవి అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి, లోకేష్‌కి , ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంకు, నియోజకవర్గ నాయకులకు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ అన్ని విధాల అభివృద్ధి చేయడానికి అహర్నిశలు పనిచేస్తానని ఆయన తెలిపారు .

నగరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకత్వం (డీఎస్



డబ్ల్యుసీఎ), సెట్విన్ సంయుక్త ఆధ్వర్యంలో 'యువా కనెక్ట్' పేరుతో నిర్వహించిన 'అంతర్జా తీయ యువ దినోత్సవం 2025'లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బృంద గానం విభాగంలో విద్యార్థులు తిరుమూర్తి, బిందు, చందిని, జయశ్రీ, కరుణ, సాము ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న 15 కళాశాలలనుంచి ఈ పోటీలకు విద్యార్థులు పాల్గొన్నారని వారిలో నగరి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థు లను, సాంస్కృతిక కోఆర్డినేటర్ డాక్టరు ఎం అరుణ కుమారిని ఆయన అభినందించారు. విజేతలకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు భాస్కరరాజు అధ్యాపకులు డాక్టరు ఎం అరుణ కుమారి, డాక్టరు రామానుజులు ప్రశంసించారు.

పశు సంరక్షణ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం పాల శీతలీకరణ ప్రాంతం ఏరియా మేనేజర్ కుమార్ రాజా ఆధ్వర్యంలో మహిళ పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ బుధవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీజ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంటు బోర్డు సహకారంతో ప్రపంచంలో మహిళల పాల ఉత్పత్తి దారుల కోసం ఏర్పడిన సంస్థ, మహిళా పాల ఉత్పత్తిదారులే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అండ్ ఛైర్మన్ వరకు అందరూ మహిళా పాల ఉత్పత్తిదారులు ఉండటం విశేషమని, శ్రీజ 11 సంవత్సరాలుగా పాల సేకరణ మహిళా ఉత్పత్తిదారుల ద్వారా ఈరోజు కు 7.5 లక్షల పైచిలుకు పాలను శ్రీజ గ్రామస్థాయి నుంచి సేకరిస్తుందని, పాలను ప్రాసెసింగ్ తర్వాత మదర్ డెయిరీ సహకారంతో మార్కెటింగ్ లో పాలు, పాల పదార్థాలుగా వినియోగదాలకు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. భారతదేశంలో 22 ప్రొడ్యూసర్ కంపెనీలలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ 2 స్థానంలోనూ , ఆంధ్రప్రదేశ్ లో 3



స్థానంలో పాల సేకరణలో ముందు ఉందని చెప్పారు. ఈ కార్యక్ర మంలో ఏరియా పిఐబి అధికారి నిరోషా , ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి జైకె (జపాన్ ఇంటర్నేషనల్ కోపరేటివ్ ఏజెన్సీ) సంస్థ సహకారంతో శ్రీజ డెయిరీ ఆవులలో పాల నాణ్యత పెరుగుదల కోసం ఉచితంగా క్యారీ బ్యాగ్స్ , పశు సంరక్షణ కిట్లును పంపిణీ చేశారు. అందులో భాగంగా ఆవుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు విషయాలు తెలిపారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి- కుప్పం జాతీయ రహదారిపై ఆర్‌టిసి బస్సును లారీ వెనుకవైపు ఢీకొన్న సంఘటనతో కిలోమీటరు మేర ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. మండలం దేవదొడ్డి బస్టాండ్ వద్ద వికోట నుండి పలమనేరుకి వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్యాసింజర్‌లో దింపేందుకు ఆగి బస్సును వెనుక భాగంలో లారీ ఢీకొంది. దీంతో బస్సు వెనుక భాగం దెబ్బతింది. లారీ అదుపు తప్పడంతో రోడ్డు పక్కన పార్క్ చేసిన టూ వీలర్ల మీదికి దూసుకుపోవడంతో నుజ్జు నుజ్జు అయ్యాయి. ఈ సంఘ



ఆర్‌టిసి బస్సును లారీ ఢీకొనడంతో స్తంభించిన ట్రాఫిక్

టన వల్ల ఇటు అటు వైపు కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఆగిపోయాయి.

జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరులో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు నిలువ ఉండి దోమల ప్రబలే అవకాశం ఉన్న కారణంగా మురుగునీరు తొలగింపు, కాలువల్లో చెత్తాచెదారం ఎత్తివేయడం , పిచ్చి మొక్కలు తొలగించడం చేస్తున్నామని ప్రజలు కూడా పంచాయతీ వారికి సహకరించి చెత్త సేకరణకు వచ్చే వాహనంలో తడి పొడి చెత్త వేరుగా వేసి సహకరించాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం కాలువలలో చెత్త వేయడం చేయరాదని చెత్త వాహనంలోనే చెత్త వేయాలని బస్టాండ్ కూడళ్ళలో కూడా దుకాణదారులు పంచాయతీ వారికి సహకరించాలని కోరారు.



డ్రగ్స్, ర్యాగింగ్‌లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : విద్యార్థులు డ్రగ్స్, ర్యాగింగ్‌లకు దూరంగా ఉండాలని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. వ్యసనాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోరాదన్నారు. కళాశాలకు వచ్చే జూనియర్స్ పట్ల స్నేహభావంతో మెలగాలి గానీ ర్యాగింగ్ పేరుతో వారిని వేధించకూడదన్నారు. ఇవి చట్ట విరుద్ధ మన్నారు. సీఐ విక్రమ్ మాట్లాడుతూ డ్రగ్స్ క్రూరమైన ఆలోచనలను రేకెత్తిస్తుందన్నారు. మత్తు



మాట్లాడుతున్న డిఎస్‌పి సయ్యద్ అబ్దుల్


పదార్థాలకు విద్యార్థులు ఏ విధంగా ఆకర్షితులు అవుతారో విపులంగా వివరించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తూ కంటబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘటితమై సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : సంఘటితమైతే సమస్యలు పరిష్కరించుకోవచ్చని అగముడయార్ మొదలియార్ సంఘ నాయకులు సీకే దయానిధి అన్నారు. బుధవారం చిత్తూరులో నిర్వహించిన అగముడయార్ల ఆరాధ్య దైవాలైన చిన్న మరుదు, పెరియమరుదు పాండియర్ల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నగరి నుండి వివిధ వాహనాల్లో భారీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను ఎదిరించిన ప్రథమ నేతలుగా చిన్న మరుదు, పెరియమరుదు కీర్తి గడించారని అలాంటి నేతల విగ్రహావిష్కణ అగముడయార్లు గర్వించదగిన అంశమన్నారు. దశాబ్దం క్రితం అగముడయార్లను రాష్ట్రంలో బీసీలుగా గుర్తించారని అయితే ఓబీసీలుగా గుర్తించలేదన్నారు. ఈ కారణంగా అగముడయార్లకు రాష్ట్రంలో మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తోందని ఇతర రాష్ట్రాలలో జనరల్ కేటగిరీకి వెళ్లిపోతున్నా మన్నారు. పాలక ప్రభుత్వాలు కేంద్రంతో చర్చించి అగముడయార్లను ఓబీసీ లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అగముడయార్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన సునీల్ కుమార్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రెడ్డిని పూతల పట్టు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి సునీల్ కుమార్ బుధవారం తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ బంగారుపాలెం మార్కెట్ యార్డ్‌లో మామిడి ధరల కోసం చేసిన పోరాటంలో పోలీసులు పలువురు కార్యకర్తలు నాయకులపై కేసులు నమోదు చేశారని తెలిపారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరి స్తున్నారని తెలిపారు. స్పందించిన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుత ప్రభుత్వం ప్రజల్లో మనుగడలేక ప్రజా సమస్యలపై ప్రశ్నించిన వారిపై కేసు నమోదు చేస్తున్నారని అంతటికీ రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పే రోజు వస్తుందని అధికారం అడ్డం పెట్టుకుని ప్రజలను



వేధించడం మానుకోకపోతే ప్రజలు తిరగ బడతారని తెలుసు కోవాల న్నారు. పూతలపట్టులోపార్టీ అభివృద్ధి, మామిడి రైతుల గురించి చర్చించారు. జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా కార్యకర్త లపై పెట్టిన కేసులు గురించి సునీల్ కుమార్ వివరిం చారు. పార్టీ కోసం కష్టపడిన వాళ్లని ఆదు కుంటామని మన ప్రభు త్వం వచ్చినప్పుడు ఇబ్బందులు పెట్టిన వాళ్లపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. మామిడి రైతుల పరామర్శ పర్యటన విజయవంతంపై సునీల్ కుమార్‌ను అభినించారు.

తహశీల్దారు కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-తవణంపల్లి:


తవణంపల్లి తహశీల్దారు కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ రాజేంద్ర పడేల్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతు భరోసా 627 మంది ఆధార్ ఫీడింగ్, పట్టాదారులు మృతి చెందిన కారణంగా రైతు భరోసా నగదు అందలేదని చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. 48 గంటలలోపు వివిధ రకాల సమస్యలు పరిష్కరించాలని తహశీల్దారు సుధాకర్‌ను ఆదేశించామని జెసి అన్నారు తవణంపల్లి మండలంలో సుమారు 750 మంది పరిష్కరించాలని అగ్రికల్చర్ ఆఫీసర్‌ను, అధికారులను ఆదేశించామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జి ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ప్రజల పక్షమే: మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : వైసిపి ఎప్పుడూ ప్రజల పక్షమే అని మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. బుధవారం మాజీమంత్రి నివాస కార్యాలయం వద్ద నగరి, నిండ్ర విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపేందుకు అధికారులు కోరిన మేరకు సమ్మతి లెటర్లను ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన, జిల్లాల విభజన, నియోజకవర్గాల విభజన, మండల పరిధిలో మార్పు అన్నవి జనాభా సంఖ్య, అవసరాలను బట్టి పాలకులు తీసుకుంటూ ఉంటారన్నారు. అలా పరిపాలనను ప్రజలకు మరింత చేరువచెయ్యాలన్న ఉద్దేశ్యంతోనే గత ప్రభుత్వం జిల్లాల విభజన చేపట్టిందన్నారు. ఆయా ప్రాంతాల వారికి దూరంగాను, అసౌకర్యంగాను వుండవచ్చని ఈ కారణంగా ప్రస్తుతం వాటిపై తాము కూడా విభజన లేఖలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బాలన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మురుగ, మోహన్‌రాజ్, యాకోబు, నళిని, కోఆప్షన్ సభ్యులు ఆనంద్, వైస్ఎంపీపీ బాలాజి, నాయకులు కృష్ణమూర్తి, అరుణాచలం, బాషా పాల్గొన్నారు.

ఘనంగా అమరనాథ నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - యాదమరి: టిడిపి చిత్తూరు జిల్లా యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథనాయుడు జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తల నడుమ భారీ కేకును కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఆయనకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందర్భంగా ఆయనను దుశ్శాలువతో సత్కరించి భారీ పూలమాల వేసి అభినందనలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అధ్యక్షులు మొరార్జీ,



ప్రధాన కార్యదర్శి రబ్బీ, హిమగిరి చిట్టి, కృష్ణ మూర్తి, జగదీష్, రవి, పార్టీ వాణిజ్య విభాగం కార్యదర్శి విజ యేంద్ర యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సతీష్, దేశం నాయకులు గోపి గౌడ్,ధరణి, గుణశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీ లు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్



అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి -సోమల: ఓ కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ కరకమంద ఆంజనేయస్వామి గుడి వద్ద సోమల నుండి సదుం వైపు వెళుతున్న కారు వేగాన్ని నియంత్రించలేక మలుపులో అదుపుతప్పి చెరువు కట్టపై నుండి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురుకి ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదాన్ని గుర్తించిన సమీపంలోని ప్రజలు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి వారిని కారులో నుండి దింపి అనంతరం జెసిబి, ట్రాక్టర్ల సాయంతో కట్ట పైనుండి పొలాల్లోకి 15 అడుగుల దిగువకు వెళ్లిన కారును పైకి తీసుకొచ్చారు. ప్రమాదానికి కారణాలేమిటో పూర్తిగా తెలియాల్సి వుంది.



మాట్లాడుతున్న బైరెడ్డిపల్లి సింగిల్ విండో చైర్మన్ నాగరాజు

రైతుల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్ బైరెడ్డిపల్లి సింగిల్ విండో పాలకవర్గ ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక సహకార సంఘ కొత్త కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్‌గా నాగరాజు, డైరెక్టర్లుగా దివాకర్ రెడ్డి, విశ్వనాథ్‌లను ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. వ్యవసాయానికి అనుకూలమైన పథకాలను సమర్థంగా అమలు చేసి ప్రతి రైతు లాభపడేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, పార్టీ నాయకులు, రైతులు, సహకార సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పలమనేరులో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

సింగిల్ విండో అధ్యక్ష , డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి-పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు సింగల్ విండో అధ్యక్ష కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం గుడియాత్తం రోడ్డులోని సింగల్ విండో కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పలమనేరు సింగల్ విండో అధ్యక్షులుగా ముడివారిపల్లికు చెందిన పెద్దబ్బ అలియాస్ కే వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. పలమనేరు సింగల్ విండో డైరెక్టర్లుగా ఎం. పాపిరెడ్డి, టీఎస్ రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా అన్ని వ్యవస్థలు పనిచేస్తున్నాయన్నారు. పులివెందులలో ప్రజలు దశాబ్దాల తరువాత స్వేచ్ఛగా తమ ఓటును వినియోగిం చుకున్నారని, టీడీపీ గెలుపు ఖాయమన్నారు. కూటమి ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్‌ను అమలు చేస్తున్నామన్నారు.



క్వారీ తనిఖీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మైనింగ్ అధికారి సోమశేఖర్, రెవెన్యూ అధికారి లోకనాథ పిళ్లై ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ ఎస్ఆర్ పురం మండలంలోని క్వారీలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ పురం మండలంలో 40 క్వారీలు ఉన్నాయని అందులో భాగంగా కటికపల్లి పిల్లి గుండ్లపల్లి గ్రామ పరిధిలో 6 క్వారీలు పరిశీలించారు . అందులో ఎన్ని క్వారీలు నిబంధనల ప్రకారం పనిచేస్తున్నాయి ఎన్ని క్వారీలు పని చేయడం లేదని పరిశీలించి నివేదికని జిల్లా సాయి అధికారులకు అందిస్తామని తెలిపారు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైన్స్ రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని క్వారీ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అని తహశీల్దార్ అరుణకుమారి అన్నారు. బుధవారం కడప మైన్స్ ఏడి సుబ్రహ్మణ్యం, ఎస్ఐ చిన్నా రెడ్డప్ప లతో కలిసి రామకృష్ణాపురం ఆముదాల రెవెన్యూ పరిధిలోని క్వారీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీ యజమానులకు ఇచ్చిన అనుమతుల పరిధిని దాటి ఎవరైనా తవ్వకాలు చేపడితే అన్ని రికార్డులు సక్రమంగా లేకుండా క్వారీలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రిషి వర్మ , ఆర్ఐ విమల, విఆర్ఓ రమేష్ నాయుడు, శంకరయ్య, విలేజ్ సర్వేయర్లు ఆలీ, చరిత, సౌజన్య, దీప పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం : మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలలో గంగ మ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కొత్తపల్లి మిట్ట గ్రామంలో ప్రజలు బుధవారం అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చు కున్నారు. యువకు లు, మహిళలు, పిల్లలు రంగులు వేసుకుని వివిధ వేషధారణలో అలరించారు.